
# బలహీనత

ప్రతాప వెంకట సుబ్బారాయుడు



ప్రతి నెలా ఇంటద్దె వసూలు చేసుకోవటం నాకో పెద్ద సమస్య. అలా అని మా ఇంట్లో అద్దెకున్నది ఏ రౌడీ మూకో...అద్దె ఇవ్వడానికి ఇబ్బంది పెట్టే మొండి రకాలో అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే.

విషయమేమిటంటే?

నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో సిటీకి దూరంగా ప్లాట్లేస్తున్నారంటే ఫ్రెండ్సందరి బలవంతం మీద నూటయాభై గజాల స్థలం అయిదు వేలకి...అదీ ఇన్‌స్టాల్ మెంట్ బేసిస్ మీద తీసుకున్నాను.

నేనా చేసేది చిన్న ఉద్యోగం. వచ్చే జీతం అరకొరగా సరిపోతుంది. స్థలముంది అక్కడో ఇల్లు కట్టించుకోవాలన్న కోరికా వుంది. ఆలోచిస్తూ కూర్చుంటే సంవత్సరాలు గడిచిపోతున్నాయి. అందుకే అయిదేళ్ళ క్రితం లోన్ తీసుకుని రెండు గదులేయించాను. సంవత్సరం పాటు అందులో వున్నాం కూడా. ఆ తర్వాత మా కంపెనీ వాళ్ళు క్వార్టర్లు కట్టించారు. క్వార్టర్లు కంపెనీ ప్రెమిసెస్‌లో వుండడం వల్లనూ... మా సొంతిల్లు కంపెనీకి పది కిలోమీటర్లు అవడం వల్లనూ పైగా పిల్లలు కంపెనీకి దగ్గరగా వున్న స్కూల్లో చదువుతుండడం వల్లనూ ఇల్లు అద్దెకిచ్చేసి...క్వార్టర్‌లోకి, మారిపోదామని నిర్ణయించుకున్నాను. ఆలోచన వచ్చిందే తడవు గేటుకి 'టులెట్' బోర్డ్ తగిలించాను.

అప్పుడొచ్చారు విశ్వనాథంగారు. ఆయనా వాళ్ళావిడా, ఒక కొడుకు, కూతురు, కొడుక్కి పధ్నాలుగేళ్ళు కూతురు కొడుక్కన్నా అయిదేళ్ళు చిన్నది.

విశ్వనాథంగారు పత్రికాఫీసులో పని చేస్తున్నారు. ఆయన మాటల్లోని మంచితనం వాళ్ళ ముచ్చటైన కుటుంబం చూశాక ఆయన మరీ మరీ అడిగిన మీదట నేను చెప్పిన దాంట్లో వంద తగ్గించి వాళ్ళకి అద్దెకిచ్చాను. తర్వాత పది రోజుల్లో నేను క్వార్టర్‌లోకి, వాళ్ళు మా ఇంట్లోకి మారిపోయాము.

నాకొచ్చే జీతానికి ఇంటద్దె కలిపితే సంసార రథాన్ని కొంతవరకైనా సాఫీగా లాగుదామనుకుంటే నాకు నిరాశే మిగిలింది. కారణం...

మొదటి నాలుగు నెలలు విశ్వనాథంగారు ఠంచనుగా అద్దె ఇచ్చారు. ఆ తర్వాతే మొదలైంది అసలు కథ-

నేను అద్దెకోసం వెళ్ళగానే విశ్వనాథం గారు గబగబా కుర్చీ వేసి నన్ను కూర్చోబెట్టి అతిథి మర్యాదలతో ఉక్కిరి బిక్కిరి చేసి రోజు రోజుకి ధరలు ఎలా పెరుగుతున్నాయో...చాలీ చాలని జీతాలతో బ్రతకడం ఎంత దుర్భరమో, ఏకరువు పెట్టి అనుకోని కష్టమొచ్చిందని వందో, రెండొందలో తగ్గించి ఇచ్చి తర్వాత ఇస్తానని చేతులు నలుపుకుంటూ నుంచునేవాడు. ఆయన్ని చూస్తే జాలేసేది. నాకంటూ ఓ సొంతిల్లు వుంది కాని నిజానికి నాదీ అదే పరిస్థితి. అందుకే అర్థం చేసుకునేవాణ్ని. నాకసలే మొహమాటం జాస్తి. ఆయన మంచితనం నన్ను కట్టిపడేసేది. అందుకే గట్టిగా అడగలేకపోయేవాణ్ని.

బోనస్‌గాని ఎరియర్స్‌గాని అందుకున్న రోజున మొట్టమొదట నాకివ్వాల్సిన బాకీ అద్దెడబ్బు ఇచ్చేసేవాడు. డబ్బెగ్గొట్టాలన్నది

ఆయన మనస్థత్వం కాదు. వచ్చే జీతం రాళ్ళతో నిత్యావసరాలు కూడా తీర్చుకోలేక కొట్టుమిట్టాడుతున్నాడు. మరో విధంగా సంపాదించడం తెలియని విశ్వనాథం గారిని ఇంటద్దె విషయం ఏం అనలేకపోయేవాణ్ణి.

ఇప్పటికి నాలుగేళ్ళ నుంచీ అంతే!

ఇంటద్దె పెంచలేదు. ఇప్పుడా ఏరియా బాగా ఇంప్రూవ్ అయింది. ఇంటద్దెలు ఎన్నో రెట్లు పెరిగాయి.

"మనమేమన్నా వున్నవాళ్ళమా? ఇంటద్దె పెంచండి. వుంటే వుంటాడు. లేకపోతే ఖాళీ చేసి పోతాడు. ఏళ్ళనాటి శనిలా దాపురించాడు. మీ అమాయకత్వాన్ని, మంచితనాన్ని బాగా ఉపయోగించుకుంటున్నాడు" కోపంగా రుసరుసలాడుతూ మా ఆవిడ దాదాపు ప్రతి రోజూ నా చెవినిల్లు కట్టుకుని పోరుతుంటుంది.

నాకూ కోపమొస్తుంది. ఏంటసలు ఈ విశ్వనాథంగారు...అద్దె పెంచే విషయం ఈ సారైనా చెప్పాలి. ఆయనకిష్టం లేకపోతే మరో ఇల్లు చూసుకోమనాలి' మనసులో పదే పదే అనుకుంటూ వాళ్ళింటికెళ్ళాను.

నేను వెళ్ళేసరికి అప్పుడే ఆఫీసు నుంచి వచ్చినట్టున్నారు. ఇంకా డ్రస్ మీదనే వుండి బాగా అలసిపోయినట్టు కనిపిస్తున్నారు.

నన్ను చూడగానే పరిగెత్తుకువచ్చి కుర్చీ వేసి నన్ను కూర్చోమని తను అరుగు మీద కూర్చున్నాడు. చల్లటి మజ్జిగ తెమ్మని వాళ్ళావిడకి పురమాయించారు.

'మర్యాదలు మొదలుపెట్టారు...ఈ నెల కూడా షరామామూలేనేమో...అద్దె పెంచే మాట దేవుడెరుగు. అసలు అద్దె ఇస్తాడో లేదో' మనసులో ఒకటే ఆలోచన.

"ఇవాళ మా ఆఫీసులో లోన్ తీసుకున్నాను. మా అబ్బాయికి డిప్లొమాలో సీట్ వచ్చింది. ఫీజ్ అదీ కట్టాలి కదా...పైగా ప్రైవేట్ కాలేజీలో సీట్ వచ్చింది. డబ్బు ఖర్చు వుంటుంది కదా! అందుకే లోన్ తీసుకున్నాను. ఇదిగోండి అద్దె' మొత్తం ఇచ్చేశాడు.

నేను డబ్బు తీసుకోవడానికి మొహమాట పడుతూ "బాబుని కాలేజీలో చేర్పించటం అంటున్నారు...డబ్బు సరిపోతుందో లేదో...అద్దె తర్వాత ఇద్దురుగాని...ఈ డబ్బు వుంచండి..."అన్నాను.

"అబ్బే! వద్దులేండి. ఇప్పటికే మీకు చాలా ఋణపడి వున్నాను. ఏదో ఆ భగవంతుడి దయవల్ల వాడి చదువు పూర్తయిపోతే మాకేం లోటుండదు. మీ అద్దె పెంచి మరీ పువ్వుల్లో పెట్టి ఇస్తాం" నవ్వుతూ అన్నాడు.

నేనూ నవ్వుతూ లేచాను.

సంవత్సరాలు గిర్రున తిరిగాయి.

విశ్వనాథంగారబ్బాయి డిప్లొమా పూర్తి చేసి ఒక ప్రైవేట్ కంపెనీలో జాయినయ్యాడు. జీతం కూడా బాగానే వస్తుందట. వాళ్ళింతో ఆనందంగా వున్నారు. మా ఇంట్లో అద్దెకున్న వాళ్లు ఆనందంగా వున్నారు కాబట్టి నేనూ సంతోషంగానే వున్నాను. అద్దె పెంచుదామనుకున్నాను. కానీ వాళ్ళ ఆనందాన్ని భగ్నం చేసిన వాడినవుతానేమో అనిపించింది. మరో నెల తర్వాత పెంచవచ్చులే అనుకున్నాను.

నాలుగు నెలల పాటు అద్దె కరెక్టుగా అయిదో తారీకున ఇంటికొచ్చి ఇచ్చాడు. ఇహ అద్దె డబ్బు ఇవ్వడానికి విశ్వనాథంగారికి ఇబ్బందేం వుండదనుకున్నాను కాని...

ఆయనకోసం పదో తారీకు దాకా ఎదురు చూసి ఆయన రాకపోయేసరికి వాళ్ళింటికి బయల్దేరాను.

నేను వెళ్ళేసరికి వాళ్ళింట్లో మరో కొత్త వ్యక్తి దర్శనమిచ్చాడు.

"ఈయన మా బావగారు. మా ఆవిడకి అన్నయ్య. అయిదు రోజులైంది వచ్చి...ఏవనుకోకండి...ఇంటికొచ్చి అద్దె ఇవ్వలేకపోయాను..."నొచ్చుకుంటూ అన్నాడు.

"పర్వాలేదు లేండి...ఇల్లు ఒకసారి చూసినట్టుగా వుంటుందని ఇలా వచ్చాను" వెళ్ళింది అద్దెకోసమే అయినా అబద్ధమాడాను.

"వీళ్ళమ్మాయి శిరీష డిగ్రీ పాసయింది. చిన్నప్పటి నుంచి మా వాడికిద్దామనుకుంటున్నారు...నేనేమో ఇంతకాలం ఎలాగూ ఆగాం కదా! ఉద్యోగంలో మావాడు పూర్తిగా స్థిరపడ్డాక పెళ్ళి చేద్దామంటే మా ఆవిడా...వాళ్ళన్నయా ససేమిరా వినడం లేదు" అన్నాడు విశ్వనాథంగారు.

"అవునన్నయ్యగారూ! వాడా ఉద్యోగంలో చేరాడు. ఆ శుభకార్యం కాస్తా అయిందనిపిస్తే మా బాధ్యత తీరిపోతుంది. మేము పీటల మీద కూర్చుని వాడి పెళ్ళి చెయ్యాలని కోరిక...ఇహ ఆ పిల్లలంటారా నిదానంగా దాని పెళ్ళి చెయ్యొచ్చు. ఏవంటారు?" అంది వాళ్ళావిడ నా వంక చూస్తూ.

"అదీ నిజమే...ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి. (ఇక్కడో విషయం మీకు చెప్పడం నా ధర్మం...వాళ్ళబ్బాయి కన్నా మా అమ్మాయి రెండేళ్ళు పెద్ద. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆమెని చదివించలేకపోవడమే కాదు. పెళ్ళి కూడా చేయలేకపోయాను) ...పెళ్ళిచేయడమే ఉత్తమం" అన్నాను.

"మీరందరూ అవునంటే ఇహ నాదేముంది?" అంటూ పెళ్ళి చేయడానికి అంగీకరించారు విశ్వనాథంగారు.

పెళ్ళి బాగానే జరిగింది...పెళ్ళి పందిట్లో విశ్వనాథంగారు నాకు చేసిన మర్యాద అంతా ఇంతా కాదు. పెళ్ళికొచ్చిన ప్రతి వాళ్ళకీ నన్ను తన ఆత్మీయుడిగా పరిచయం చేశారు. నా మీద ఆయనకున్న అభిమానానికి నాకు నోట మాట రాక కళ్ళు చెమర్చాయి.

ఇల్లు ఇరుకవుతోందని రెండిళ్ళవతల మరో ఇల్లు అద్దెకు తీసుకుని వాళ్ళబ్బాయి చేత కాపురం పెట్టించారు. మళ్ళీ ఆయనా, ఆయన సమస్యలు మామూలే!

నెల నెలా ఇంటద్దె ఇవ్వలేకపోతున్నారు...ఇచ్చినా పూర్తిగా ఇవ్వటం లేదు.ఇప్పటికీ విశ్వనాథంగారిని ఇల్లు ఖాళీ చేయమనలేదు. అది నా బలహీనత.

❁

## అలుపెరగని కమల్!

కమల్‌హాసన్‌కు యాభైలో పడినా అలుపెరగకుండా పనిచేస్తూనే ఉన్నాడు. ఆయనలో ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. బాలీవుడ్‌లో ఇప్పటివరకూ సక్సెస్ సాధించలేకపోయానన్న బాధ కమల్‌లో ఇప్పటికీ కనిపిస్తోంది. మహమ్మద్ గజనీలాగా బాలీవుడ్‌కు దండయాత్రలు చెయ్యడం మానేది లేదని ఖరాఖండీగా చెబు తున్నాడు. బాలీవుడ్ నెంబర్‌వన్ హీరో షారూఖ్ ఖాన్ సైతం కమల్ ఉత్తమ నటుడు అని అన్నాడు. కమల్ ఈ ప్రయత్నం ఎంతవరకూ సక్సెస్ అవుతుందో చూద్దాం. లెట్స్ వెయిట్ అండ్ సీ!

